# నో రియాక్షన్

ద్విభాష్యం రాజేశ్వరరావు

'క్లినిక్' రోగులతో కిటకిటలాడిపోతుంది.

ఒక్కొక్కరిని త్వరితంగా పరీక్షించి చీటీలు వ్రాసి ఇస్తున్నాను.

రోజూ మామూలుగా ఇంజెక్షన్లు తీసుకునే వాళ్ళవద్దనుండి సీసాలు తీసుకొని 'సిరెంజి' లోకి ముందు 'లోడ్'చేసి కాంపౌండరు నాకు అందిస్తున్నాడు. ఇంజెక్షన్లు చేస్తూ చిరునవ్వుతో వాళ్ళు చేప్పే సమాచారం వింటున్నాను.

సాయంకాలం ఈ గంటసేపూ నాకు ఊపిరి తిరగనంత పని! మధ్యాహ్నం అంత ఖాళీగానే వుంటుంది. అయిదూ, ఆరుగంటల మధ్యలో మాత్రం విపరీతమయిన రద్దీ. అందరికీ ఖాళీగా దొరికే సమయం ఇదే!

నేను ప్రాక్టీసు ప్రారంభించి సుమారు రెండు సంవత్సరాలయింది. ఈ ప్రాంతంలో వేరే డాక్టరు లేకపోవటంవలన నా పని బాగానే వుంది. ఏడాది తిరిగేసరికే 'బిజీ' డాక్టర్ల జాబితాలోకి చేరిపోయాను. వృత్తిలోనూ, జీవితంలోనూ కూడా ఈ రెండు సంవత్సరాల్లోనూ నిలదొక్కుకున్నాను.

ఈ రద్దీ సమయంలో అతడు వచ్చాడు! అతని పేరేమిటో నాకు తెలీదు. ఇంతకు ముందెన్నడూ నేను అతణ్ణి చూడలేదు. వచ్చి తలుపుదగ్గరే ఒకవారగా నిలబడ్డాడు. అతడు చూడటానికి చదువుకున్నవాడిలా కన్పించటం లేదు. గెడ్డం మాసిపోయి కాస్త నీరసంగా కూడా కన్పిస్తున్నాడు. అతడి కళ్ళు అమాయకంగా వున్నాయి. ఒక్కక్షణం అతనివంక చూసి అతని నమస్కారం అందుకొని నా ప్రొఫెషనల్ చిరునవ్వు అతనికి విసిరేసి మిగిలిన రోగుల్ని పరీక్షించటంలో మునిగిపోయాను. అతనివద్దకు వెళ్ళటానికి నాకు మరో పదిహేను నిమిషాలు పట్టింది. 'ఏం కావాలి?' అన్నట్లు అతనివంక చూశాను మెడలోని 'స్టెత్' సర్దుకుంటూ. అతను జేబు లోంచి ఒక ఇంజెక్షను సీసాతీసి నాకు అందించాడు.

—అది 'పెన్సిలిన్'!!

"ఇంజెక్షన్ చెయ్యాలి!" అన్నాడు.

"ఈ రకం కేసులు నాకు మామూలే! మెడికల్ షాపులవాళ్ళదగ్గర రోగలక్షణాలు చెప్పి మందులు కొంటారు. ఏదో డాక్టరు వద్దకువెళ్ళి ఆ ఇంజెక్షన్లు తీసుకుంటారు. అలా చేస్తే డాక్టరికిచ్చే 'కన్సల్టేషను ఫీజు' తగ్గుతుంది!

ఈ సంగతి నాకు తెలుసు. అయినా, నా మామూలు ప్రశ్నలు నేను మానలేదు.

"దేనికి?" అడిగేను.

"కాలిమీద సెగగడ్డలు లేచాయి" అన్నాడు ముక్తసరిగా.

"ఎవరు వాడమన్నారు?"

"మావూరిదగ్గర డాక్టరున్నాడు, ఆయన!"

ఇది పెన్సిలిన్! రియాక్షన్ వచ్చే ప్రమాదం వుంది! అందుకని అడిగేను.

"ఇంతకుముందు ఎప్పుడయినా తీసుకున్నావా?"

"నిన్ననే తీసుకున్నాను"పొడిగా అన్నాడు.

సీసాలో చూశాను, అయిదు మోతాదులకు నాలుగు మోతాదులు మాత్రమే వుంది. నిన్న ఒకమోతాదు తీసుకున్నాడు కాబట్టి నేను వేరే 'టెస్టు' చేయనక్కరలేదు. ధీమాగా సిరెంజి లోకి మందు ఎక్కించి అతనికి ఇంజెక్షను ఇచ్చాను. సూది బయటకు తీసేటంతటితో అతనికి ఒళ్లంతా విపరీతమయిన చెమటలు కమ్మేయి. చూస్తుండగానే మొదలు నరికిన తరువులా అక్కడే నేలమీద కూలిపోయాడు.

మందు అతనికి 'రియాక్షన్' ఇచ్చింది! నిన్ననే తీసుకున్నాడు కదా అనే ధీమాతో టెస్టు చేయకుండా మందు ఇచ్చేను కాని. ఈ రియాక్షన్ ఏమిటి? అతడు అబద్ధం చెప్పాడనుకునేందుకు వీలులేదు. సీసాలో కూడా ఒక మోతాదు తక్కువగానే వుంది.

కంపౌండరు, మిగిలిన రోగులు కలిసి అతణ్ణి బల్లమీద పడుకోబెట్టారు. రియాక్షను తగ్గి తెలివి రాటానికి గబగబా మూడు ఇంజక్షన్లు చేశాను. నాడి పరీక్షిస్తూ అతనిప్రక్కనే వుండిపోయాను. మిగిలిన రోగులు మార్చి మార్చి అతనివంకా నావంకా చూస్తున్నారు. వాళ్ళచూపుల్లో నా యెడల గౌరవభావమో, నిరసనభావమో తెలియటంలేదు.

పావుగంట గడిచింది.

ఈ పావుగంటలోనూ నాకు వేరే ఏ ఆలోచనా వెళ్ళలేదు.

మరో రెండు ఇంజక్షన్లు చేసి అతని ప్రక్కనే మతిపోయినవాడిలా నిలబడ్డాను. ఇంకో అయిదు నిమిషాలలో నా ప్రయత్నం ఫలించింది.

అతడు మెల్లగా కనులు విప్పాడు.

'దాహం' అన్నట్లు సంజ్ఞ చేశాడు.

మంచినీళ్ళు నోట్లో పోశాను. తరువాత కొద్దిసేపటికి మెల్లగా లేచి కూర్చున్నాడు.

పని కుర్రవాడిని పంపి వేడికాఫీ తెప్పించాను.

కాఫీ త్రాగేక మామూలు మనిషి అయ్యాడు అతను!

నేను దీర్ఘంగా ఊపిరి పీల్చుకున్నాను. గర్వంగా రోగులవంక ఒకమారు చూసేను.

అతడు నెమ్మదిగా లేచాడు. వెళ్ళిపోటానికి సిద్ధమయ్యాడు.

అతడిమీద అంతవరకూ నేను దాచుకున్న ఆగ్రహం బయటకు వచ్చింది. అతడు ప్రమాదవశాత్తూ చనిపోయివుంటే నాకు మాట వచ్చేది. ఇంజక్షనుచేసి చంపేశానని అందరూ నన్ను ఆడిపోసుకొని వుండేవారు.

"నిజంగా నిన్న నువ్వు ఇంజెక్షను తీసుకున్నావా?" నా సందేహ నివృత్తి కోసం కోపంగా అతనివంక చూస్తూ అడిగేను.

అతడు మెల్లగా అన్నాడు. "తీసుకున్నాను. నిన్ననూ ఇలాగే జరిగింది." మాటలు ముగించి తలుపు వైపుకు నడిచాడు.

నాకు నవ్వాలో ఏడవాలో అర్థంకాలేదు.

అతణ్ణి వెనక్కు పిల్చాను.

"ఈ ఇంజక్షను నీకుపడదు! మరోమాటు తీసుకుంటే ప్రాణం పోయినాపోవచ్చు! ఇక తీసుకోకు!" అన్నాను మందలింపు ధోరణిలో.

"నిన్న ఆ డాక్టరుగారూ అలాగే చెప్పారు. ఆయనకి ఇంజెక్షను ఇవ్వటం సరిగ్గా రాదేమోననుకొని ఈవేళ మీదగ్గరకు వచ్చాను." గొణుగుతున్నట్లు అంటూ వెళ్ళిపోయాడు.

నాకు మతిపోయింది!

అతడు రేపు ఇంకో డాక్టరు దగ్గరకు వెళ్ళి మళ్ళీ ఈ మందును తీసుకోకుండా వుంటాడని నాకు నమ్మకంలేదు! ***